క్లుప్తంగా

వైద్య శిబిరం విజయవంతం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రశాంత్

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని బీసీ కాలనీలో గురువారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంత్ రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించి వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

తల్లాడ: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో తల్లాడ ఎస్టీఆర్ కాలనీలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి షుగర్, బీపీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. ఇద్దరికి బీపీ, షుగర్ ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు నాగేశ్వరరావు, ఆంజనేయులు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

చింతకాని: 104 కాంట్రాక్ట్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని.. సైదులు, ఉదయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం చింతకాని పీహెచ్‌సీ వైద్యాధికారి అల్తాఫ్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న నాలుగునెలలు వేతనాలు చెల్లించేవరకు విధులకు విరామం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి 104 కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని శ్రీసాయి బాబా ఆలయాల్లో బాబాకి గురువారం ఆయా దేవాలయాల అర్చకులు స్వామికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. బాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేసి కర్పూర హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని శ్రీసాయి నిలయంలో భక్తులకు పలువురు దాతలు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అయోధ్య మరణం పార్టీకి తీరని లోటు

సత్తుపల్లిరూరల్: భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సీపీఐ సీనియర్ నాయకుడు, భద్రాద్రి కొత్తగూడెంజిల్లా నాయకుడు బొల్లోజు అయోధ్య మరణం పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ అన్నారు. గురువారం సత్తుపల్లిలో నిర్వహించిన సంతాప సభలో అయోధ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ సత్తుపల్లిటౌన్ సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, సీపీఐ మండల కమిటీ సభ్యులు వీరభద్రం, మహిళా సమైఖ్య సత్తుపల్లి నియోజకవర్గ కన్వీనర్ రంజాన్‌బీ, రాజశేఖర్, పద్మ, లక్ష్మి, వెంకటేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

గుండెపోటుతో హైకోర్టు న్యాయవాది మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

కారేపల్లి: మండలంలోని గేటుకారేపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది పర్సా అనంత నాగేశ్వరరావు(45) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. వృత్తిరీత్యా ఉదయం హైదరాబాద్‌లోని హైకోర్టుకు వెళ్లిన అనంత నాగేశ్వరరావు.. కోర్టులో ఓ కేసు పరిశీలనలో ఉండగా ఒక్కసారిగా గుండెపోటు రావటంతో అక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి న్యాయవాదులు సీపీఆర్ చేసిన ప్రయోజనం లేకుండా పోయింది. అప్పటికే అనంతనాగేశ్వరరావు మృతి చెందాడు. దీంతో స్వగ్రామం గేటుకారేపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్యతో పాటు, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

అనారోగ్యంతో గ్రామ దీపిక..



రమాదేవి

కొణిజర్ల: అనారోగ్యంతో చికిత్స పొందుతూ కొణిజర్ల మండలం పెద్దగోపతి ఐకేపీ గ్రామ దీపిక గురువారం మృతి చెందింది. వివరాల ప్రకారం పెద్దగోపతి గ్రామసమాఖ్య సభ్యురాలు తడికమళ్ల రమాదేవి(45) గత కొద్ది రోజులుగా జ్వరం లంగ్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. రమాదేవి మృతదేహాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె నారాయణరావు, మాజీ సర్పంచ్‌లు చిన్న పుల్లయ్య, దానియేలు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి, గ్రామ సమాఖ్య సభ్యురాళ్లు సందర్శించి నివాళులు అర్పించారు.

‘ఉపాధి’లో నిబంధనలు కఠినతరం

- పని ప్రదేశాల్లో కూలీల ఫొటోలు.. నిరంతర పర్యవేక్షణ
- రెండు ఫొటోల నమోదుతోనే వేతనం



బోనకల్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

బోనకల్: ఉపాధి పథకంలో మారిన నిబంధనలు కఠినతరం కావడంతో అవినీతికి అస్కారం లేకుండా జవాబుదారీతనం పెంచేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ చర్యలకు శ్రీకారం చుట్టింది. వలసల విధానాన్ని అరికట్టి సొంత గ్రామాల్లోనే కూలీలకు పనులు కల్పించాలన్న లక్ష్యంతో గత 2006లో నాటి కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి ఏటా పనుల గుర్తింపు, నిర్వహణతో పాటు కూలీలకు ఉపాధి చూపుతున్నారు. పలుచోట్ల కూలీల హాజరుతో పాటు మస్టర్ల నమోదులో అవినీతి జరుగుతుందని సోషల్ ఆడిటర్లు, తనిఖీ బృందాలు గుర్తించి రికవరీలు సైతం చేశారు. ఐనా అవినీతి తగ్గకపోవడంతో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఇటీవల కొత్త విధానాన్ని ప్రవేశ పెట్టింది.

యాప్‌లో రెండుపూటల ఫొటోలు..

పని ప్రదేశంలో రెండు పూటల కూలీల ఫొటోలు తీయాల్సిందేనని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఒక్క పూట పని చేస్తే వారికి అంత వరకు కూలీ వచ్చేటట్లు యాప్‌ను ఏర్పాటు చేశారు. పని ప్రదేశాల్లో తీసిన ఫొటోలను ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్)యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అదే విధంగా పనుల కల్పనకు సంబంధించి గుర్తించిన పని ప్రదేశాన్ని ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అక్కడ హాజరైన కూలీలు ఆ పని ప్రదేశంలో పనులు చేస్తున్న ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తేనే మస్టర్ పడుతుంది. బయటకు వచ్చిన తరువాత ఫొటో తీస్తే యాప్ తీసుకోదు.

పర్యవేక్షణలో అధికారులు..

పని ప్రదేశంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తీసిన ఫొటోలను గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి ఎంపీఓ, ఎంపీడీఓ, జిల్లా అధికారులతో పాటు రాష్ట్రస్థాయిలో గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ వరకు ర్యాండమ్‌గా ప్రతిరోజు పర్యవేక్షిస్తారు. పాత ఫొటోలను అప్‌లోడ్ చేస్తే వెంటనే దొరికిపోయే విధంగా యాప్‌ను రూపకల్పన చేశారు. కొత్త నిబంధనలతో మస్టర్ల నమోదు ప్రక్రియ పకడ్బందీగా ఉంటుందన్న చర్చ జరుగుతుండగా, మరోవైపు పని ప్రదేశాల్లో రెండు పూటల ఫొటోల అప్‌లోడ్ విధానం సిబ్బందికి పరీక్షగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిరంతరం పర్యవేక్షణ..



ఉపాధి పథకంలో వచ్చిన కొత్త నిబంధనలు వలన జవాబదారీతనం పెరిగింది. రెండు పూటల హాజరుతో పనికి వచ్చే వారికి మాత్రమే వేతనాలు అందుతాయి. అవినీతికి తావు లేకుండా ప్రవేశ పెట్టిన ఈ విధానంలో నిరంతర పర్యవేక్షణ జరుగుతుంది.

– ఆర్.రమాదేవి, ఎంపీడీఓ

పకడ్బందీగా పనులు..



ఉపాధి పనుల నిర్వహణ పకడ్బంధీగా జరుగుతుంది. పని ప్రదేశానికి వెళ్లి ఫొటో తీస్తేనే అప్‌లోడ్ ప్రక్రియ పూర్తవుతుంది. బోగస్ మస్టర్లకు చెక్ పెట్టే విధంగా కొత్త విధానాన్ని రూపొందించారు. శ్రమకు తగిన వేతనం ఉపాధిలో పని చేసే వారికి లభిస్తుంది.

– కృష్ణ కుమారి, ఏపీఓ, బోనకల్

నానో యూరియా వినియోగించుకోవాలి



చింతకాని: అవగాహన కల్పిస్తున్న మధిర ఏడీఏ విజయ్ చంద్ర

చింతకాని: పంటల సాగులో ద్రవరూపంలో ఉండే నానో యూరియాను వినియోగించుకోవాలని మధిర వ్యవసాయ సహాయ సంచాలకుడు విజయ్ చంద్ర రైతులకు సూచించారు. మండల పరిధిలోని చిన్నమండవ గ్రామంలో గురువారం వరి పంటపై నానో యూరియాను పిచికారీ చేసి క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలపై నానో యూరియాను పిచికారీ చేయటం వలన 80 నుంచి 85శాతం వరకు నత్రజని వినియోగ సామర్థ్యం ఉంటుందన్నారు. పర్యావరణానికి అనుకూలంగా ఉండటమే కాకుండా గ్రీన్‌హౌస్ వాయువులుగా వాతావరణంలో కోల్పోయే నత్రజని మొత్తాన్ని తగ్గిస్తుందని రైతులకు వివరించారు. నానో యూరియా, డీఏపీ లను కొన్ని రకాల పురుగు మందులతో కలిపి పిచికారీ చేసుకోవచ్చని, తద్వారా రైతుకు ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ సోములపల్లి మానస, వ్యవసాయ విస్తర్ణాధికారి కల్యాణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్

కల్లూరు: కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో దోమల నివారణపై మున్సిపల్ సిబ్బందికి కమిషనర్ ఎ.సంపత్‌కుమార్ అవగాహన కల్పించారు. గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సిబ్బందికి అవగాహన కల్పిస్తూ అన్ని వీధుల్లో మురుగు కాలువల్లో నీరు నిలువ లేకుండా చూడడం, ఖాళీ ప్రదేశాల్లో నీటి నిల్వలు గుర్తించడం, గృహాల్లో మూతలేని వాటర్ ట్యాంకులు, గాబులు, కుండల్లో నీటి నిల్వ లేకుండా చూడడం, పాడైపోయిన టైర్లు, తాగి పారేసిన కొబ్బరి బోండాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాయంత్రం వేళల్లో ఫాగింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓ నందిశెట్టి నాగేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ గుండపునేని రామారావు తదితరులు ఉన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష



పెనుబల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పెనుబల్లి/తల్లాడ: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మలాజ్యోతి, సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, సత్యావతి పేర్కొన్నారు. గురువారం పెనుబల్లిలోని నాలుగు అంగన్‌వాడీ సెంటర్లలో, తల్లాడ మండలంలోని మల్లారం అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, తల్లిపాల వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసాలు, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, గ్రామ కార్యదర్శి సిద్దిక్ మియా, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలి



నాగులవంచ జీపీ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

చింతకాని: గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని నాగులవంచ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీలు అర్హులకు ఇళ్లు ఇవ్వకుండా వారికి ఇష్టం ఉన్నవారికే ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు రవి, వెంకటనర్సయ్య, కొండలరావు, అప్పారావు, గోపాలరావు, రామయ్య, యాదయ్య, తదతరులు పాల్గొన్నారు.

చినుకు పడితే వరదే..

కురుస్తున్న మండల పరిషత్ కార్యాలయం



కొణిజర్ల: మండలంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖలకు ముఖ్య కార్యాలయం అయిన మండల పరిషత్ కార్యాలయం వానలకు కురుస్తున్నది. గట్టిగా నాలుగు చినుకులు పడినా వరండా రికార్డు రూమ్ అంతా కురుస్తున్నది. మండల కేంద్రం కొణిజర్లలో దాదాపు 25 ఏళ్ల క్రితం మండల పరిషత్ కార్యాలయం, తహసీల్ భవనాలు నిర్మించారు. అయితే వాటి నాణ్యతా లోపం వల్ల స్లాబ్ పగుళ్ల ఏర్పడి ఇనుప చువ్వలు బయటకు వచ్చి.. వాటినుంచి నీరు కారుతుంది. దీంతో మండల పరిషత్ సిబ్బంది టబ్బులు పెట్టి నీళ్ల మడుగు కాకుండా చూస్తున్నారు. వర్షం కురిసే సమయంలో ఎంపీడీఓ ఛాంబర్‌కు వెళ్లాలంటే ఈ కారిడార్ గుండానే వెళ్లాల్సి రావడంతో నీళ్లలో నుంచే వెళ్తూ అటు సందర్శకులు, ఇటు సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారు. స్లాబ్ కురుస్తున్న కారణంగా విద్యుత్ వైరింగ్ కూడా షార్ట్ సర్క్యూట్ జరిగి వైరింగ్ కాలిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

తల్లాడ మండలానికి 21మంది లైసెన్స్ సర్వేయర్లు



తహసీల్‌లో సర్వేయర్లు

తల్లాడ: తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, భూ సబంధిత సమస్యలను సత్వర పరిష్కారానికై తల్లాడ మండలానికి 21మంది లైసెన్స్ సర్వేయర్లను నియమించింది. రెండు నెలలు అప్రంటీస్‌పై గురువారం మండలానికి వచ్చారు. వారం దరూ తహసీల్‌లో రిపోర్టు చేయగా.. అందరినీ తహసీల్దార్ వంకాయలపాటి సురేష్‌కుమార్ అభినందించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు వితరణ



నోట్ పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో దాత గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు

ఎర్రుపాలెం: మండలంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక సొసైటీ మాజీ అధ్యక్షుడు బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి రూ.20వేల విలువ చేసే నోట్ పుస్తకాలను వితరణ చేశారు. వితరణ పుస్తకాలను గురువారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థులకు అందించారు. దాత వితరణను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వెన్నపూస కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వరలక్ష్మి వ్రత పూజలు



ముస్తాబైన మారెమ్మతల్లి ఆలయం

కల్లూరురూరల్: కల్లూరు ఎన్నెస్పీ క్రాస్‌రోడ్‌లోని శ్రీశ్రీశ్రీ మారెమ్మతల్లి ఆలయంలో శుక్రవారం నుంచి వారంరోజుల పాటు వరలక్ష్మీ వ్రతం పూజలు నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి గణపతి పూజ, కలశపూజ, అమ్మవారికి పంచామృతాల అభిషేక పూజ, లక్ష్మీదేవి అలంకరణ, లక్ష్మీ అష్టోత్తర కుంకుమార్చన, మంగళహారతి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు మేచర్ల నాగమల్లేశ్వరరావు, మాణిక్యమ్మ తెలిపారు.

ఈ సందర్భంగా ముత్తైదువులతో శ్రావణ మాసంలో నిర్వహించే వరలక్ష్మీవ్రత పూజ, కుంకుపూజతో పాటు ఆదిపరాశక్తి శ్రీశ్రీశ్రీ మారెమ్మ అమ్మవారికి ధూపదీప నైవేద్య నీరాజన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలి



ఎర్రుపాలెం: మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేందర్



ముదిగొండ: మాట్లాడుతున్న వైద్యాధికారి అరుణాదేవి

ఎర్రుపాలెం/చింతకాని/బోనకల్/ముదిగొండ: మండలంలోని 1–19 సంవత్సరాల వయస్సు ఉన్న వారందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని ఎంపీడీఓలు బి.సురేందర్, చుంచు శ్రీనివాసరావు, రమాదేవి, మండల వైద్యాధికారులు పుల్లయ్య, స్రవంతి, ప్రశాంత్, అల్తాఫ్, అరుణాదేవి పేర్కొన్నారు. గురువారం ఎర్రుపాలెం, చింతకాని మండల పరిషత్ కార్యాలయాల్లో, బోనకల్ పీహెచ్‌సీలో, ముదిగొండ తహసీల్‌లో నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అన్ని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో 19సంవత్సరాలలోపు పిల్లలందరికీ (ఆల్బెండజోల్)నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ తమ పిల్లలను పాఠశాలకు పంపించి ఈ మాత్రలను వాడేలా చూడాలన్నారు. ఆ రోజు అనారోగ్య కారణంగా వేయలేని పిల్లలకు ఆగస్టు 18న వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలల్లో తహసీల్దార్లు ఉషా శారద, రమాదేవి, ఎంపీఈఓ శ్రీలక్ష్మి, ఎంఈఓ బి.మురళీమోహన్, సలాది రామారావు, ఇన్‌చార్జ్ ఎంఈఓ రమణయ్య, సీడీపీఓ కమలప్రియ, బాలత్రిపుర సందరి, ఐసీడీఎస్ ఏసీడీపీఓ జి.కృష్ణశ్రీ, సీహెచ్‌ఓ వీరేందర్, సూపర్‌వైజర్ రమాదేవి, హెల్త్ సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, కృష్ణారావు, దానయ్య, ఏఓ సరిత, టీడీ లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయరాజు, పశువైద్యాధికారి డాక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల నుంచి విముక్తి కల్పించాలి



మధిర మున్సిపాలిటీ కమిషనర్‌కు వినతి ఇస్తున్న బీజేపీ నాయకులు

మధిర: మధిర మున్సిపాలిటీతో పాటు విలీన గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువగా ఉందని, కోతుల బెడద నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలని బీజేపీ మధిర పట్టణ అధ్యక్షుడు శివరాజ్ సుమంత్ కోరారు. మధిర మున్సిపల్ కమిషనర్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోతులు గుంపులుగా ఇళ్లల్లోకి చేరి కుటుంబసభ్యులను గాయపరచడమే కాకుండా ఇంటి సామగ్రిని చిందరవందర చేస్తున్నాయన్నారు. వన్యప్రాణి చట్టం ప్రకారం కోతులను పట్టేవారిని పిలిపించి వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి సాంబశివరావు, జిల్లా అధికార ప్రతినిధి నాగేశ్వరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో కోతుల బెడద..

- బెంబేలెత్తిపోతున్న విద్యార్థులు



కారేపల్లి మోడల్ స్కూల్ గేటు వద్ద కోతులు.. భయపడుతున్న విద్యార్థులు

కారేపల్లి: కారేపల్లి మోడల్ స్కూల్‌కు కోతుల బెడద పట్టుకుంది. స్కూల్‌కు రావాలంటేనే.. విద్యార్థులు ఒణికిపోతున్నారు. స్కూల్ గేటు వద్ద, గోడలపైన కోతులు గుంపులు గుంపులుగా తిరగడటం, విద్యార్థులపై ఎగబడటంతో.. భయంతో విద్యార్థులు పరుగులు తీయాల్సిన పరిస్థితి వచ్చింది. పలు సందర్భాల్లో విద్యార్థులు కిందపడి కాళ్లు, చేతులకు గాయాలైన ఘటనలు లేకపోలేదు. ఇప్పటికైనా.. సంబంధిత అధికారులు చొరవ చూపి కోతుల బెడద నుంచి విద్యార్థులను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి




మధిర: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

మధిర/చింతకాని: బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి కె.విజయరెడ్డి, సీనియర్ జిల్లా నాయకుడు జ్వాలా నర్సింహారావు పేర్కొన్నారు. గురువారం చింతకాని, మధిరలోని నిదానపురంలో బీజేపీ నాయకులు మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేసిన అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ.. పేద ప్రజలు, రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనే పథకాలను ప్రవేశపెడుతుందని, ఆ పథకాలు ప్రజలకు చేరే విధంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో మధిర నియోజకవర్గ కన్వీనర్ నాగేశ్వరరావు, టౌన్ అధ్యక్షుడు శివరాజు సుమంత్, చింతకాని, మధిర బీజేపీ మండల అధ్యక్షులు గోపి, శ్రీహరి చౌదరి, కన్వీనర్లు వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు సాంబశివరావు, నాగేశ్వరరావు, రమేష్, స్వర్ణాకర్, మహిళా నాయకురాలు గుండా శ్రీలక్ష్మీ, రాజేశ్వరి, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా కల్వర్టులు

- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- భయం భయంగా ప్రయాణాలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- పట్టించుకోని అధికారులు



తూతకలింగన్నపేట గ్రామం వద్ద అధ్వానంగా కల్వర్టు


ఏన్కూరు: మండలంలో గత రెండు సంవత్సరాలు కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోయి ప్రమాదభరితంగా మారాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో రోడ్డుపై ప్రయాణం చేసే వాహనచోదకులు భయం భయంగా ప్రయాణం చేస్తున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

ఎక్కడెక్కడ కొట్టుకుపోయాయంటే..

ముచ్చర్ల నుంచి ఏన్కూరు వెళ్లే రహదారిలో తూత కలింగన్నపేట వద్ద ఉన్న కల్వర్టు మొత్తం కొట్టుకుపోయింది. పీకే బంజరా – రాజలింగాల మధ్య, మూలపోచారం – రంగాపురం మధ్య కల్వర్టు కొట్టుకుపోయింది. రేపల్లెవాడ – నాచారం మధ్య, నాచారం – గంగుల నాచారం, గంగుల నాచారం – ఒంటిగుడిసె మధ్య కల్వర్టులు భారీ వర్షాలకు కొట్టుకుపోయాయి. అయినా అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

– తూతకలింగన్నపేట కల్వర్టుకు నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని అప్పటి ఎంపీపీ అరెం వరలక్ష్మి 2023న గ్రీవెన్స్‌డేలో వినతి పత్రాలు అందజేసింది. దీంతో ఆర్‌అండ్‌బీ ఈఈ రూ. 1.40 కోట్లు నిధులు మంజూరు చేశారు. అయినా పనులు చేపట్టడంలో అధికార యంత్రాంగం విఫలమైంది.


కల్వర్టులు దెబ్బతిన్నాయి..



మండలంలో గత రెండు సంవత్సరాలుగా కురిసిన భారీ వర్షాలకు కల్వర్టులు దెబ్బతిన్నాయి. దీంతో రోడ్లన్ని గుంతల మయం అయ్యాయి. నిత్యం ఈ రహదారి నుంచి ఇల్లెందు నుంచి తల్లాడకు భారీ వాహనాలు వెళ్తూ ఉంటాయి. తిమ్మారావుపేట నుంచి మద్దులపల్లి వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు అద్వానంగా ఉంది.

– బి.కృష్ణ, గ్రామస్తుడు, తూతకలింగన్నపేట

రూ. 1.40 కోట్ల నిధులు మంజూరు..



ఏన్కూరు నుంచి నిత్యం పలు గ్రామాలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. మరమ్మతులకు గురైన రోడ్డుకు నిధుల మంజూరుకు 2023సంవత్సరంలో అధికారులకు వినతులు అందించాం. దీంతో రూ. 1.40 కోట్లు నిధులు కేటాయించారు. అయినా.. ఇప్పటి వరకు కూడా పనులు మొదలు పెట్టలేదు.

– అరెం వరలక్ష్మి, మాజీ ఎంపీపీ, ఏన్కూరు